తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
4 ఏప్రిల్ 2026
Follow :




ఖైరతాబాద్ జోనల్ కమిషనర్
ప్రియాంక అల ఐఏఎస్




బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11, సర్వి హోటల్ పక్కన నాడు కూల్చిన అక్రమ భవనం



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11, సర్వి హోటల్ పక్కన నేడు కట్టిస్తున్న అక్రమ కట్టడం



జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 18, ప్లాట్ నెంబర్ 241 - బి2 జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం



జూబ్లీహిల్స్ ఫిలిం ఛాంబర్ ఎదురుగా విజేత సూపర్ మార్కెట్ పాత భవనంపై అక్రమంగా నిర్మిస్తున్న భారీ షెడ్డు



జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్చార్జి ఏసిపి సురేష్

# ఐఏఎస్... అడ్మినిస్ట్రేషన్ తుస్..!!

## వీఐపీ జోన్‌లో టౌన్ ప్లానింగ్‌పై ఎన్నో సందేహాలు

- అనుభవం లేనివారిని ఇన్‌చార్జి ఏసీపీ, సెక్షన్ అధికారులుగా ఎలా..?
- ఖైరతాబాద్ జోనల్‌లో పరిపాలనపై ప్రశ్నల పరంపర
- అక్రమాలకు పాల్పడుతున్న ఆఫీసర్లపై చర్యలు ఏవీ..?

**పట్టణాభివృద్ధి పరంగా అత్యంత కీలకమైన జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ ఇప్పుడు వివాదాల కేంద్రంగా మారుతోంది. జూబ్లీహిల్స్ సర్కిల్ 36, ఖైరతాబాద్ సర్కిల్ 35 ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై వినిపిస్తున్న విమర్శలు పరిపాలనపై పెద్ద ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాల నియంత్రణలో లోపాలు ఉన్నాయా? లేక గ్రౌండ్ లెవెల్ అమలు బలహీనంగా ఉందా? అనే సందేహాలు స్థానికులలో వేగంగా వ్యాపిస్తున్నాయి.**



జూబ్లీహిల్స్ సర్కిల్ సెక్షన్ ఆఫీసర్ సాయికిరణ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 03 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలోనే ప్రభుత్వ యంత్రాంగం, విఐపి జోన్‌గా గుర్తింపు పొందిన ఈ ప్రాంతాల్లోనే ఇలాంటి ఆరోపణలు రావడం విశేషం. ముఖ్యమంత్రులు, గవర్నర్, సినీ ప్రముఖులు, ఉన్నతాధికారులు నివసించే ప్రాంతాల్లోనే టౌన్ ప్లానింగ్ అమలు ప్రశ్నార్థకంగా మారితే, సాధారణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థ వాటిని కట్టడి చేయడంలో ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదనే సందేహం వ్యక్తమవుతోంది. స్థానికుల వాదన ప్రకారం, కొన్ని చోట్ల అనుమతులు లేకుండా నిర్మాణాలు ప్రారంభమవుతున్నాయనే ప్రచారం వినిపిస్తుండగా, కొన్ని సందర్భాల్లో నోటీసులు ఇచ్చినా పనులు ఆగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇవి అధికారికంగా నిర్ధారించబడని అంశాలేనని గమనించాలి. అయినప్పటికీ ఇలాంటి ప్రచారం కొనసాగుతుండటం పరిపాలనకు ఇబ్బందికరంగా మారుతోంది.ఇదే సమయంలో "అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యల కంటే వసూళ్ల ఆరోపణలు ఎందుకు వినిపిస్తున్నాయి?" అనే ప్రశ్న కూడా ముందుకు వస్తోంది. ఈ ఆరోపణలకు ఎటువంటి అధికారిక ధృవీకరణ లేకపోయినా, ప్రజల్లో ఏర్పడుతున్న అభిప్రాయం మాత్రం పరిపాలనపై ప్రభావం చూపుతోంది. ఒకవేళ ఈ ప్రచారాన్ని ఖండించాల్సిన అవసరం ఉంటే, స్పష్టమైన చర్యల ద్వారా విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ సర్కిళ్లలో కంటే దృష్టి మొత్తం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక ఆలా ఐఏఎస్ పై పడింది. ఒక ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఉన్న ఈ జోన్‌లో గ్రౌండ్ రియాల్టీపై పూర్తి అవగాహన ఉందా? ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్లు జరుగుతున్నాయా? ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అధికార వర్గాలు మాత్రం సమస్యలను పరిశీలిస్తున్నామని చెబుతున్నప్పటికీ, ప్రజలు మాత్రం ప్రత్యక్ష ఫలితాలను ఆశిస్తున్నారు.

### అందరిచూపు ఇటే..

పట్టణాభివృద్ధి నిపుణుల అభిప్రాయం ప్రకారం, చట్టాలు ఎంత బలంగా ఉన్నా అమలు బలహీనమైతే ప్రయోజనం ఉండదని స్పష్టం చేస్తున్నారు. ఫీల్డ్ లెవెల్‌లో కఠిన చర్యలు, పారదర్శక వ్యవస్థ, సమయపాలన.. ఇవి లేకపోతే అక్రమ నిర్మాణాలను నియంత్రించడం కష్టమవుతుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా విఐపీ జోన్‌లలోనే కఠిన నియంత్రణ లేకపోతే ఇతర ప్రాంతాలకు అది తప్పు సందేశం పంపే ప్రమాదం ఉందని అంటున్నారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి కూడా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. నియమాలు పాటించే వారికి ఇబ్బందులు, ఉల్లంఘనలు చేసే వారికి సడలింపులు ఉన్నాయనే భావన పెరుగుతుండటం పరిపాలనపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. "వ్యక్తులు కాదు, వ్యవస్థ పని చేయాలి" అనే మాట ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ జోన్‌లో టౌన్ ప్లానింగ్ వ్యవస్థపై వచ్చిన ఈ విమర్శలు, సందేహాలు, ఆరోపణలు ఇవన్నీ కలిసి ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. ఒక ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో ఉన్న పరిపాలనలోనే ఇలాంటి పరిస్థితి ఎందుకు కనిపిస్తోంది? అనే సందేహానికి సమాధానం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పుడు అందరిచూపు ఒక్కటే.. ఖైరతాబాద్ జోన్‌లో పరిపాలన కఠిన చర్యల

## ఉప్పల్ మీడియా క్లబ్

# నూతన కమిటీకి ఘన గౌరవం

### ప్రజాసేవలో మీడియా పాత్ర కీలకం



**ఉప్పల్, (జనంసాక్షి):** ఉప్పల్ ప్రాంతంలో మీడియా ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఉప్పల్ మీడియా క్లబ్ (ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా) నూతన కమిటీకి ఘన సత్కారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పిల్లి నాగ రాజు ముదిరాజ్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిల్లి నాగరాజు ముదిరాజ్, పూడూరి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత మీడియాపై ఉందని పేర్కొన్నారు. మీడియా ఐక్యతతో పనిచేస్తే ప్రజలకు మరింత న్యాయం జరిగే అవకాశముందని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులకు వారు అభినందనలు తెలియజేశారు. నిజాయితీతో వార్తలను ప్రజలకు అందిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అదేవిధంగా ఉప్పల్ మీడియా క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి మాట్లాడుతూ మీడియా ఐక్యతే సంస్థ బలమని తెలిపారు. సభ్యులందరూ సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలమని చెప్పారు. భవిష్యత్తులో మీడియా ప్రతిష్టను మరింత పెంచే కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మీడియా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో అనుమానాస్పద మృతి కేసు నమోదు



**శంషాబాద్, (జనంసాక్షి):** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి ప్రకారం మూసా కాలనీ, చౌదరిగూడ గ్రామానికి చెందిన రహీమ్ ఉద్‌దిన్ ఖాన్ (80) అనే వృద్ధుడు ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. అదే కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎం.డి. అబ్దుల్ కలాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి రహీమ్ ఉద్‌దిన్ ఖాన్ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసు లు అక్కడికి చేరుకుని ఇంటి తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా, రహీమ్ ఉద్‌దిన్ ఖాన్ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. శరీరంపై పురుగులు పడి ఉండటంతో, ఆయన 3,4 రోజుల క్రితమే మరణించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రాథమికంగా గుండె పోటు లేదా ఇతర అనారోగ్య కారణాల వల్ల మృతి జరిగి ఉండవచ్చని భావిస్తు న్నారు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం తరలించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

## పురుగుల మందు సేవించి కార్మికుడు మృతి



**శంషాబాద్, ఏప్రిల్3 (జనంసాక్షి):** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కార్మికుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. చౌదరిగూడ గ్రామానికి చెందిన బక్క సురేష్ (46) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా గ్యాస్ సమస్యతో బాధపడుతూ మందులు వాడుతు న్నాడు. ఏప్రిల్ 2 ఉదయం ఇంట్లో వాంతులు చేసుకుంటుండగా, అతని భార్య బక్క సుశీల గమనించింది. అతని వద్ద పురుగుల మందు వాసన రావడంతో, సమీపంలో "లేతల్ గోల్డ్" అనే పురుగుల మందు సీసా కనిపించింది. అనుమానం వచ్చిన ఆమె వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఏప్రిల్ 3 తెల్లవారుజామున సురేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆరోగ్య సమస్యల కారణంగా సురేష్ స్వయంగా పురుగుల మందు సేవించి ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఎటువంటి అనుమానం లేదని భార్య తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు.

# రామంతాపూర్‌లో మల్లెల మైసమ్మ ఆలయ పునర్నిర్మాణం ముగింపు దశలో

### - సీఎంఆర్ఎఫ్ సహాయాల పంపిణీ



**ఉప్పల్, ఏప్రిల్ 03 (జనంసాక్షి):** రామంతాపూర్ లక్ష్మీనారాయణ కాలనీలోని మల్లెల మైసమ్మ ఆలయ పునర్నిర్మాణ కార్యాలు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుటకు తుది అలంకరణ పనులు జరుగుతున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ బాధ్యులు మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. వచ్చే వారంలో ఆలయ పునఃప్రారంభం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులను పరమేశ్వర్ రెడ్డి సమీక్షించారు. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యాల పురోగతిని కాలనీ సంఘ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా మిగిలి ఉన్న పనులు, అవి పూర్తయ్యే గడువు వంటి అంశాలపై శిల్పులతో చర్చించి, పనులు మెరుగైన రీతిలో పూర్తయ్యేలా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘ అధ్యక్షులు లుకాస్, నాగేశ్వరావు, మధుబాబు, రాములు, మీసాల సురేందర్ రెడ్డి, ప్రతిభ, శ్రీను, సుధాకర్ నాగరాజు, బ్రహ్మాచారి, ఆర్టీసీ కుమార్, భాస్కర్, అచ్చిరెడ్డి, శ్రీహరి, చారి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంలో, ముఖ్యమంత్రి ఉపశమన నిధి (సీఎంఆర్ఎఫ్) పేద మరియు మధ్యతరగతి ప్రజలకు వరప్రదంగా నిలుస్తోందని పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయధనం సకాలంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సత్యం (1,30,000), రాజేంద్ర ప్రసాద్ (60,000), ఆఫ్రీనా సుల్తానా (20,000), దిరావత్ బాలాజీ (39,000), శాలిని (35,000), సొంటి రెడ్డి గాల్ రెడ్డి (32,000), సాత్విక్ రెడ్డి (40,000), చౌదర్పల్లి పద్మ (23,000)లకు సహాయం అందింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకిటి ఆగం రెడ్డి, బజార్ జగన్నాథ్ గౌడ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గడ్డం యాదగిరి, విట్టల్ నాయక్, ప్రకాష్ రెడ్డి, పాసిగంటి నాగరాజు, షరుఫుద్దీన్, ఉమా, మంచాల రఘు, రంగుల శేఖర్ పాల్గొన్నారు.

# నాసిరకంగా సీసీరోడ్ల నిర్మాణం

- **2 రోజుల్లోనే రోడ్లపై పగుళ్ళు ఏర్పడుతున్నాయి**
- **బీవీహెచ్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింలు**



**బంట్వారం ఏప్రిల్ 3 (జనంసాక్షి):** బంట్వారం మండల పరిధిలోని సల్బత్తాపూర్ గ్రామంలో ఎస్ఆర్ఆజీఎస్ కింద సీసీరోడ్లు మంజూరు కాగా సంబంధిత కాంట్రా క్టర్లు ఇష్టారాజ్యంగా నాసిరకంగా రోడ్లు వేస్తున్నారని బీవీ హెచ్ పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింలు ఆరోపించారు. ఆయన మాట్లా డుతూ సీసీరోడ్డు వేసిన రెండు రోజులకే ఎక్కడికక్కడ పగుళ్లు తేలుతున్నాయన్నారు. 1:3:6 నిష్పత్తిలో సిమెంటు, ఇసుక, కంకర, మిశ్రమంతో సీసీరోడ్లు వేయాల్సి ఉండగా ఇసుక వాడకం లేకుండా డస్ట్ ఎక్కువ మొతాదులో ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో పగుళ్లు ఏర్పడుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి నాసిరకం రోడ్లకు ఇంజనీర్లు బిల్లులు ఎలా చెల్లిస్తారని ప్ర శ్నించారు. మండల వ్యాప్తంగా నాణ్యతను పట్టించు కోకుండా రాత్రి పగలు తేడా లేకుండా నాసిరకమైన సీసీరోడ్డు వేయడంతో ప్రజాధనం వృథా అవుతుందన్నారు. ఇసుక లేకుండా డస్ట్ ఎక్కువ మొత్తంలో వాడటంతో వేసిన నాసిరకం రోడ్లకు పగుళ్లు ఏర్పడి వేసిన నెల రోజులలోపే ధ్వంసం అవుతాయన్నారు. నాసిరకంగా సీసీరోడ్లు వేస్తు న్నప్పటికీ అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తు న్నారని ఆరోపించారు. ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే సీసీరోడ్ల నిర్మాణాలను పరిశీలించి, సరైన పద్ధతిలో వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాసిరకంగా వేసిన రోడ్లకు బిల్లులు చెల్లించొద్దని పేర్కొన్నారు.

## వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎం. కృష్ణారెడ్డి నియామకం



**బంట్వారం ఏప్రిల్ 03 (జనంసాక్షి):** కోటమర్పల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎం.కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ జిల్లా నియమితులయ్యారు. ఇప్పటి వరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించిన ఆయనకు పార్టీ అధిష్ఠానం ఈ పదవిని కట్టబెట్టింది. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీని జిల్లా అధ్యక్షుడు దారాసింగ్, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి నియామకంపై పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమైంది. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. అనేకమంది బాల కార్మికులను బాల కార్మిక వ్యవస్థ నుంచి విడుదల చేయించి విద్యాబుద్ధులు నేర్పించి వారికి బంగారు భవిష్యత్తును అందించిన ఘనత ఉంది సామాజిక కార్యకర్తలు తదితరులు అభినందించారు.

## సాయుధ పోరాటానికి ప్రాణం పెట్టిన అమరుడు దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులు

**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాటంలో తన ప్రాణాలను అర్పించి రైతాంగ హక్కుల కోసం పోరాడిన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కురుమ సంఘం చైర్మన్ బి. జైహింద్ రావు, అధ్యక్షులు సి. బీరప్పలు పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా మణికొండ డివిజన్ లో ఘనంగా చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఆయన చేసిన త్యాగాలు, నిర్భయ పోరాట స్ఫూర్తి తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ బీరప్ప మల్లన్న స్వామి సదనంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు కొమరయ్య విప్లవాత్మక పోరాటం రైతులకు, పేదలకు ప్రేరణగా నిలిచిందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం చైర్మన్ బి. జైహింద్ రావు, అధ్యక్షులు సి. బీరప్ప, ప్రధాన కార్యదర్శి ఈ. వెంకటేశ్వరరావు, కోశాధికారి గణేష్‌తో పాటు కమిటీ సభ్యులు స్థానికులు పాల్గొని అమరుడికి ఘన నివాళులు అర్పించారు.



# మిన్నంటిన 'గుడ్ ఫ్రైడే' ప్రార్థనలు

- సనత్‌నగర్‌లో భక్తిశ్రద్ధలతో క్రాస్ ర్యాలీ



**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** లోక రక్షకుడు ఏసు క్రీస్తు సిలువ మరణాన్ని స్మరిస్తూ సనత్‌నగర్ నియోజకవర్గంలో 'గుడ్ ఫ్రైడే' వేడుకలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రాస్ ర్యాలీ(సిలువ యాత్ర) ఇమ్మానుయేల్ ఎం.బి.చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని పాస్టర్ రెవ ఎ.శ్రీనివాస్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఏసుక్రీస్తు తన మరణం ద్వారా మానవాళికి అందించిన త్యాగాన్ని, ఆయన పడిన శ్రమలను గుర్తుచేస్తూ భక్తులు నిశ్శబ్దంగా, భక్తి భావంతో ఆధ్యాత్మికంగా పురవీధుల సాగారు. ఏసుక్రీస్తు సిలువను మోస్తు న్న దృశ్యాలు, ఆయన కష్టాలను ప్రతిబింబించే కథాంశాలు ఈ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచా యి. ఈ సంద ర్భంగా రెవ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మానవాళి మనుగడ కోసం, పాప విముక్తి కోసం ఏసుక్రీస్తు తన ప్రాణాలను బలి ఇచ్చారు. ఆయన చూపిన ప్రేమ, దయ, కరుణ క్షమాగుణం నేటి సమాజానికి ఎంతో అవసరం. క్రీస్తు మార్గంలో నడుస్తూ తోటివారి పట్ల జాలిని ప్రదర్శించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ పరిధిలోని వివిధ చర్చి ల ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో ఐక్యంగా పాల్గొన్నారు .ముఖ్యంగా మెథడిస్ట్ చర్చ్, బాప్టిస్ట్ చర్చ్, సి.ఎస్.ఐ చర్చ్, ఇండిపెండెంట్ యు నైటెడ్ చర్చ్, సియోన్ చర్చ్, బెతేల్ ప్రేయర్ హౌస్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ లో రేవ కె.జె.క్లైమెంట్, గెర్షోన్ ప్రకాష్, జోవార్ కెన్నె డీ, రాజగోపాల్, కె.సి.నిస్సి జోష్వా, బెంజమిన్ దబె ట్టా, కె.సనీల్, బి.జి.విలియం తదితరులు పర్యవేక్ష కులుగా వ్యవహరించి, వేడుకలు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు.

# ఉప్పల్‌కు వరాల వర్షం... అభివృద్ధి పనులకు భారీ నిధులు

ప్రజల అవసరాలే ప్రాధాన్యం - పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, ఏప్రిల్ 3 (జనంసాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మరింత వేగం అందుకుంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం మౌలిక సదుపాయాల పెంపుపై దృష్టి సారించగా, స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక కృషితో పలు కీలక పనులకు నిధులు మంజూరయ్యాయి.కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటికి శాశ్వత పరిష్కారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఉప్పల్‌ను అభివృద్ధిలో ఆదర్శనియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు.మంజూరైన పనుల వివరాల ప్రకారం, రామంతాపూర్ డివిజన్‌లోని సత్యనారాయణస్వామి ఆలయం నుంచిమార్కండేయస్వామి ఆలయం వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయించారు. రామంతాపూర్‌లోని భారత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌కు పెయింటింగ్, షెడ్ నిర్మాణం, ఫ్లోరింగ్, కంపౌండ్ వాల్ మరియు ఇతర మరమ్మతుల కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. చిలుకానగర్ గుట్టపై కురుమ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించగా, చిలుకానగర్‌లోని వడ్డెర సంఘ భవనానికి గ్రౌండ్ , మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.34.25 లక్షలు మంజూరు చేశారు. బీరప్పగడ్డలోని రామాలయం కమ్యూనిటీ హాల్ మిగిలిన పనుల కోసం రూ.15.75 లక్షలు కేటాయించారు. ఉప్పల్ డివిజన్‌లోని శేషసాయినగర్‌లో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధుల మంజూరుతో డ్రైనేజ్ సమస్యలు, రహదారి సమస్యలు, కమ్యూనిటీ సదుపాయాల లోపం వంటి సమస్యలకు పరిష్కారం లభించనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేస్తే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు తెలిపారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**జవహర్ నగర్, (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా జవహర్ నగర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్లు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, మీడియా మిత్రులు, కవులు, కళాకారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా కొమురయ్య ఫొటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడిన మాజీ మేయర్లు, కొమురయ్య తెలంగాణ రైతాంగ హక్కుల కోసం పోరాడిన అమర వీరుడని కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ, కొమురయ్య ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని అన్నారు. యువతలో పోరాట స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**దోమ ఏప్రిల్ 03 (జనంసాక్షి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను బొంపల్లి గ్రామ యువకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పువ్వుల మాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయనను ఉద్దేశించి మాట్లాడారు. దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడిన దొడ్డి కొమురయ్య సాహసాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు రామన్నమాదిగ. గ్రామ యువకులు కుర్వ రమేశ్, గుడిసె రాములు, బోయిని శేఖర్, కుర్వ శ్రీనివాస్, కుర్వ మహేశ్, బంటు నర్సింహులు, బంటు పెంటయ్య, చాకలి మధు, పాల్గొన్నారు.

## తార్నాకలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఓయూ ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ




**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఓయూ ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్ట పరచడానికి ఓయూ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ ను ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ డ్రైవ్ ను చేపట్టినట్లు ఓయూ ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ చెప్పారు. ఈ డ్రైవ్ వారం రోజుల కొనసాగుతుందని ఆయన తెలిపారు. వాహనాల తనిఖీతో పాటు, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ ట్రాఫిక్ ఎస్ఐ దుర్గారెడ్డి, ఏఎస్ఐ వెంకట్రావు, జయసుధ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతులు-సాధించే విజయాలు

### ఓయూలో గోడపత్రిక విడుదల

ఈ నెల6న బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ప్రజా గాయకుడు గద్దర్ పై కాల్పులు జరిగి 29 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ప్రశ్నించే గొంతులు-సాధించే విజయాలు అనే అంశంపై సభను నిర్వహిస్తున్నట్లు గద్దర్ ఫౌండేషన్ కార్యదర్శి జి.వి. సూర్యకిరణ్ తెలిపారు. సభను ఈ నెల 6వ తేదీన బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జి.వి. సూర్యకిరణ్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 6వ తేదీన బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సభకు విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పరుశురాం, పలు విద్యార్థి సంఘాల నాయకులు సునీల్ శెట్టి, నామా సైదులు, కొమ్మనబోయిన సైదులు, పాల్గొన్నారు.

## ప్రమాదాల రహదారి

లాల్ పాడు చౌదరి గూడ



**జిల్లేడు చౌదరి గూడా (జనంసాక్షి):** కొన్ని రహదారులు ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి డ్రైవింగ్ వచ్చిన రోడ్డు బాగాలేక మరణిస్తున్నా వాహనదారులు అదేవిదంగా జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలో రహదారులు ఈ కోవకే చెందినవి ఉన్నాయి కొద్దిరోజుల క్రితం చౌదరిగూడ నుంచి లల్ పాడు వైపు వెళుతున్న ఓ బైక్ ముందోచే వాహనానికి సైడ్ ఇయ్యబోయి అదుపు తప్పి కిందపడింది మహిళకు కాళ్ళు విరగా తలకు గాయలైన్నాయి రోడ్డు విశాలంగా లేకపోవడంతో బైక్ అదుపు తప్పి కింద పడ్డారని స్థానికులు తెలిపారు వాహనాలు కిందపడి ప్రాణాలు పోతున్నాయి ఈ రోడ్డు విశాలంగా వేయగలరని వాహనదారులు కోరుతున్నారు. ఈ రోడ్డు పై నుంచి పోవాలంటే ప్రాణాలు అరిచేతులో పెట్టుకొని పోవాల్సి వస్తుంది ఈ రోడ్డు త్వరగా విస్తరించండి మహా ప్రభు అన్ని వాహనదారులు కోరుతున్నారు.

# దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

**ఘనంగా 99వ జయంతి వేడుకలు.**
**నివాళులర్పించిన వివిధ పార్టీల నాయకులు**



**మల్కాజిగిరి ఏప్రిల్ 03(జనంసాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గం కురుమ సంఘం అధ్యక్షులు జోగు వెంకటేష్ కురుమ ఆధ్వర్యంలో వినాయక నగర్, సంతోషిమా చౌరస్తాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర నాయకులు బాలలింగం, ప్రొఫెసర్ అయిల చంద్రయ్య , కాంగ్రెస్ నాయకులు పిట్టల శ్రీనివాస్ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేసిన గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. బహుజన విప్లవ వీరుల చరిత్రను నేటి తరానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు వగ్గు చంద్రశేఖర్ రావు, సిటీ ఉపాధ్యక్షులు చేగూరి రామ్మోహన్, రాష్ట్ర కురుమ యువత కార్యదర్శి ఆసర్ల శ్రీకాంత్, జోగు కుమారస్వామి, పేర్నె ఆంజనేయులు, వగ్గు మురళి కృష్ణ, చిందం శ్రీనివాస్, పరంధాములు, గుత్తి రాంచందర్, దయ్యాల రవి, జంగయ్య, జోగు శ్రీనివాస్, బీరప్ప, రాములు, ఆంజనేయులు, అనిల్, వగ్గు సత్తయ్య, మల్లేష్, నాగరాజు, శివకుమార్, యాదగిరి, క్రాంతి, శేఖర్, నరేష్, శ్రీకాంత్, చంటి, నరేందర్, మల్లేష్, సతీష్, శ్యామ్, సంపత్, రాము, వెంకటేష్, కరణం గోపి, కిరణ్ రజక, రాజు గౌడ్, బాలరాజ్ యాదవ్, పిట్టల భాస్కర్, పిట్టల నాగరాజు పాల్గొని అమరుడికి అంజలి ఘటించారు.

## తెలంగాణ తొలి సాయుధ పోరాట యోధుడు అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ



**కాప్రా, ఏప్రిల్ (జనంసాక్షి) :** తెలంగాణ తొలి సాయుధ పోరాట యోధుడు అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ నీ నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్ర రెడ్డి అన్నారు. నాగారం కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య ఏర్పాటుచేసిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ తొలి సాయుధ పోరాట యోధుడు అమరుడు దొడ్డి కొమురయ్య అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కు శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ సాయినాథ్ గౌడ్, కురుమ సంఘం ప్రెసిడెంట్ చిన్నం భాస్కర్ కురుమ, ప్రధాన కార్యదర్శి మజ్జిగ కృష్ణ, కార్యవర్గ సభ్యులు,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య



**చేవెళ్ల, ఏప్రిల్ 03 (జనంసాక్షి):** తెలంగాణ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య, రైతుల హక్కుల కోసం పోరాడిన యోధుడు అని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ వీరయోధుడు దొడ్డి కొమురయ్య 99 జయంతి సందర్భంగా స్థానిక కాలే యాదయ్య, మున్సిపాలిటీ చైర్ పర్సన్ సమతా వెంకట్ రెడ్డిలు వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. దొడ్డి కొమరయ్య తెలంగాణ రైతాంగ పోరాటంలో తొలి అమరవీరుడిగా చరిత్రలో నిలిచిపోయారని అని కొనియాడారు. 1946లో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సమయంలో ఆయన తన ప్రాణాలను అర్పించి రైతుల హక్కుల కోసం పోరాడిన యోధుడు, ఆయన జీవితం మనకు ఒక గొప్ప సందేశం అని అన్నారు. అన్యాయం ఎదురైనప్పుడు మౌనంగా ఉండకూడదు, ధైర్యంగా ఎదిరించాలని అన్నారు. సమాజంలో సమానత్వం కోసం, న్యాయం కోసం పోరాడాలన్నారు. దొడ్డి కొమురయ్య 99వ జయంతిని జరుపుకుంటున్న సందర్భంగా, ఆయన చూపిన మార్గంలో నడవడం మనందరి బాధ్యత అని అన్నారు. నేటి యువతగా మనం సమాజానికి ఉపయోగపడేలా పనిచేయాలన్నారు. విద్యతో పాటు విలువలను అలవరచుకోవాలి తెలిపారు. దొడ్డి కొమరయ్య త్యాగం వృథా కాకూడదు, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా మాత్రమే ఆయనకు నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, చేవెళ్ల కౌన్సిలర్ మాజీ సర్పంచ్ బండారి శైలజ ఆగి రెడ్డి, కౌన్సిలర్లు దేవులపల్లి శ్రీనివాస్ రెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, మంగలి కళ్యాణి, కృష్ణా నాయక్, తాళ్లపల్లి నర్సింలు, పెద్దోళ్ల దయాకర్, కరికె మీనాక్షి, దూత మల్లేష్, కురుమ సంఘం మండల అధ్యక్షులు కరికె వెంకటేష్, గుండాల రాములు, శేఖర్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## గుడ్ ఫ్రైడే సందర్భంగా బీరప్పగడ్డలో ప్రార్థనల్లో పాల్గొన్న ఇర్షాద్ ఖాన్



**ఉప్పల్, ఏప్రిల్ 03 (జనంసాక్షి):** పవిత్రమైన గుడ్ ఫ్రైడే సందర్భంగా బీరప్పగడ్డ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో ఉన్న కాల్వరీ బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభువైన యేసుక్రీస్తు చేసిన మహత్తర త్యాగాన్ని స్మరించుకుంటూ క్రైస్తవ సోదర సోదరీమణులతో కలిసి ఆయన భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. గుడ్ ఫ్రైడే మనిషికి ప్రేమ, త్యాగం, క్షమ, సేవ వంటి విలువలను బోధించే పవిత్ర దినమని ఆయన పేర్కొన్నారు. అనంతరం చర్చికి విచ్చేసిన మహిళలకు బహుమతులు అందజేసి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ముగింపులో చర్చి పాస్టర్ రెవ. మనోహర్ జాను ఆశీర్వాదాలు స్వీకరించి సమాజంలో శాంతి, ఐక్యత, అభివృద్ధి నెలకొనాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఇల్లూరి ప్రసాద్, రాజు బడితి, అరుణ్ జాను, శశాంక్ సామ్యూయెల్, శ్రావణ్, జోషి తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకం

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రా రెడ్డి**



**చేవెళ్ల, (జనంసాక్షి)** చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ వీరయోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని బిఅర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే, పట్లోళ్ళ సబితాఇంద్రా రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రేరణగా నిలిచిన మహానుభావుడు అని పేర్కొన్నారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, చేవెళ్ల బిఆర్ఎస్ నాయకులు నత్తి క్రిష్ణా రెడ్డి, కనకమామిడి మల్లా రెడ్డి, పెంజర్ల అనంత రెడ్డి, తలారి యాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్, దండు సత్యనారాయణ, బేగరి నర్సిములు, ఎర్ర మల్లేష్ తదితరులు ఉన్నారు.

# మన ఐక్యత మనకు మేలు

**క్రీస్తు కొరకు పరుగు పందెము.**
**షద్రక్ డాక్టర్ ఏ,సుధాకర్**

**మోమిన్ పేట. (జనంసాక్షి):** మోమినిపేట మండలంలోని, అన్ని డినామినేషన్స్, పాస్టర్లు, యువజన సంఘం సభ్యులు నేడు జరిగే పరుగు పందెంలో పాల్గొనాలని షద్రక్ష సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మన ఐక్యతే మనకు మేలు చేస్తుందని ఉద్దేశంతో క్రీస్తు కొరకు పరుగు పందెము ను శనివారం ఉదయం కాసుల బాద్, గేటు నుండి మెథడిస్ట్ చర్చి వరకు నిర్వహించడం జరుగుతుందని , తెలిపారు. యేసు వైపు చూచుచు, మన ఎదుట నిర్వహించబడే పరుగుపందెంలో ఓపికతో, పరుగెత్తాలని ఆయన సూచించారు.



# చలించిన శంకర్ హృదయం.. పరిమళించిన మానవత్వం

- ఒకే రోజు రేషన్ కార్డు.. రేషన్ బియ్యం
- వృద్ధురాలి సమస్యలను తీర్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని వృద్ధురాలు లక్ష్మమ్మ(70) చాలాకాలంగా రేషన్ కార్డు లేక ఇప్పటివరకు కనీసం రేషన్ బియ్యాన్ని కూడా తీసుకోలేదు. అయితే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి వెళ్లగా అక్కడే ఉన్న లక్ష్మమ్మ అనే వృద్ధురాలు ఎమ్మెల్యేతో తన గోడు వెళ్ళబోసుకుంది. తనకు 70 సంవత్సరాలు ఉన్నా రేషన్ కార్డు లేదని పెన్షన్ కూడా లేదని ఇల్లు లేదని దయచేసి ఇప్పించాలని ఎమ్మెల్యేను వేడుకుంది. వృద్ధురాలి అవస్థలు చూసి చలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే అధికారులతో మాట్లాడి వెంటనే రేషన్ కార్డును మంజూరు చేయించారు. ఒకే రోజులో రేషన్ కార్డును మంజూరు చేయించి



వృద్ధురాలు లక్ష్మమ్మకు తన చేతితో రేషన్ బియ్యాన్ని అందజేశారు. తనవంతు సహాయంగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు నాయకులు ఉన్నది పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేయడానికేనని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. పెన్షన్లను గాలికొదిలేసి వృద్ధుల అవస్థలకు కారణమయ్యారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. లక్ష్మమ్మకు వచ్చే నెల నుండి పెన్షన్ అందించే బాధ్యత తమదన్నారు. ఇందిరమ్మ ఇల్లును కూడా కట్టిస్తామని హామీ ఇచ్చారు.

# డీసీసీలో ఉప్పల్ నియోజకవర్గానికి ప్రాధాన్యం



**మేడ్చల్, ఏప్రిల్ 03 (జనంసాక్షి):** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లో ఉప్పల్ నియోజకవర్గానికి ప్రాధాన్యం లభించింది. ఈ క్రమంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులకు కీలక పదవులు కేటాయించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పదవులు పొందిన వారు : బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి – వైస్ ప్రెసిడెంట్ (హబ్సిగూడ డివిజన్)

సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి – వైస్ ప్రెసిడెంట్ (కుషాయిగూడ డివిజన్)

మహ్మద్ అబ్బుల్ జలీల్ పాషా – జనరల్ సెక్రటరీ (రామంతాపూర్ డివిజన్)

కొంపల్లి బాలరాజ్ – జనరల్ సెక్రటరీ (చిలుకానగర్ డివిజన్)

పాకాల రాజ్‌కుమార్ – జనరల్ సెక్రటరీ (ఏఎస్‌రావునగర్ డివిజన్)

చుక్క సురేష్ – జనరల్ సెక్రటరీ (మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్)

హెచ్‌ఆర్ మోహన్‌రాజ్ – అధికార ప్రతినిధి (నాచారం డివిజన్)

పాశికంటి నాగరాజు – సెక్రటరీ (ఉప్పల్ డివిజన్)

దండ్ల మురళీ – సెక్రటరీ (కాప్రా డివిజన్)

ముద్దసాని రాంరెడ్డి – సెక్రటరీ (నాచారం డివిజన్)

పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని కొత్తగా నియమితులైన నాయకులు తెలిపారు.

# పిఎల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులుగా పిల్లోడి జస్వంత్ తేజ్ కార్యదర్శిగా అభిలాష్





**బంట్వారం ఏప్రిల్ 3 (జనం సాక్షి) :** పి ఎల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ 2016లో డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య పిఎల్ ఫౌండేషన్ స్థాపించారు 2016 నుంచి స్వచ్ఛంద సంస్థను అనేక రకాలుగా పేద పిల్లల కోసమే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకై అనారోగ్యంతో బాధపడుతున్నటువంటి వారికి కొన్ని కార్యక్రమాల్లో నిర్వహించారు తదనంతరం ప్రస్తుతం 2026 లో పిఎల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులుగా పిల్లోడి జశ్వంత్ తేజ నియమించడం పిల్లోడి అభిలాషను కార్యదర్శిగా అమృతం మా ట్రెజరర్ గా సలహాదారునిగా మచ్చ రమేష్ కోశాధికారిగా కావలి ప్రభావతి సహాయ కార్యదర్శిగా కావలి అరుణ్ కుమార్ స్పోర్ట్స్ అధికారిగా కొలుకూరు ప్రశాంత్ కుమార్ కార్య నిర్వాహకునిగా కొలుకూరు ప్రవీణ్ కుమార్ స్పోకెన్ ఇన్చార్జిగా పిల్లోడి బాలకృష్ణ హెల్త్ ఇన్చార్జిగా కావలి ప్రబలత పిల్లోడి ప్రశాంత్ కుమార్ 100 మందితో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకై ప్రత్యేకమైన కార్యక్రమాలు బాల కార్మికుల చేస్తున్న పని నుంచి విడదల చేసి ఆయా ప్రాంతాలలో పాఠశాలలో చేర్పడం అనారోగ్యంతో బాధపడుతున్నటువంటి వారికి ప్రత్యేకమైన వైద్యాన్ని అందించడానికి ప్రయత్నించడం పిల్లల్ని పిల్లలుగా చూడాలని ఈనాటి పిల్లలే రేపటి పౌరులని నినాదిస్తూ ఈ సంస్థను ముందుకు నడుపుతారని పి.ఎల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పిల్లోడి లక్ష్మయ్య ఆశించి ఎవరికి ఏ ఏ బాధ్యతలు ఉన్నాయో వారికి నియామక పత్రాలు అందజేశారు.

# సునామీలా ఏఐ ముప్పు

**ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి**

## ఏవిఎన్ లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 3(జనం సాక్షి ) :** ఒక సునామీలా ముంచుకొస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ముప్పును ఎదుర్కొనడానికి ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలు కోల్పోతే దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత ప్రమాదంవైపు నెట్టబడుతుందని, ప్రత్యామ్నాయంగా బ్లూ కాలర్ ఉద్యోగాలకు అనుగుణంగా వాతావరణాన్ని మార్చుకోవలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. విద్యావేత్త, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఇబ్రహీంపట్నంలో స్థాపించిన ఏవిఎన్ లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పరిస్థితులకు అనుగుణంగా విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని వివరించారు. ఏఐ సునామీలో దేశం ఎదుర్కోబోయే సమస్య ఎంత తీవ్రమైందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని పిలుపునిచ్చారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ విద్య అందుబాటులో ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఎక్కడ విఫలమయ్యామో ప్రజా ప్రతినిధులు అందరూ ఆలోచన చేయాలి. పరిస్థితులకు అనుగుణంగా కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఎక్కడో ఒకచోట ప్రారంభం కావాలి. వ్యవస్థను ఎంపవర్ చేయాల్సిన అవసరముంది. తెలంగాణ ప్రభుత్వం విద్యపైన ప్రత్యేక శ్రద్ధ, ఆసక్తిని చూపుతోంది. అందులో భాగంగానే వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను, ఒక్కో పాఠశాలలో 2500 విద్యార్థులు చదువుకునేలా నిర్మాణాలు ప్రారంభించాం. ఇప్పటికే 59 స్కూల్స్ పనులు ప్రారంభించాం. మూడో తరగతి చదువుతున్న విద్యార్థి ఒకటో తరగతి పుస్తకాన్ని చదవలేని పరిస్థితి. 6వ తరగతిలో ఉన్న విద్యార్థి 3వ తరగతి పుస్తకం చదవలేకపోతున్నాడు. విద్యలో నాణ్యత తగ్గుతోంది. ఈ పరిస్థితి దేశ భవిష్యత్తుకే అత్యంత ప్రమాదకరం. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం 1 లక్షా 8 వేల రూపాయలు ఖర్చు చేస్తోంది. బడ్జెట్లో 8.3 శాతం నిధులు విద్యపైన ఖర్చు పెడుతున్నాం. ప్రైవేటు విద్యా సంస్థల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ, యూకేజీ విధానం లేదు. రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుంటే, 11 వేల ప్రైవేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం విఫలం చెందడం వల్లే ప్రైవేటు వైపు వెళుతున్నారు. అందుకే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మకంగా వంద ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి విధానం తీసుకొస్తున్నాం. 1.34 కోట్ల జనాభా కలిగిన హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో పాఠశాలలను రేషనలైజేషన్ చేసి ప్రయోగాత్మకంగా మోడల్ స్కూళ్లను ప్రారంభిస్తున్నాం. ప్రైవేటు పాఠశాలలు సక్సెస్ కావడానికి నర్సరీ, ఎల్ కేజీ వంటి విధానంతో పాటు రవాణా సౌకర్యం కూడా ఒక కారణం. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటికి తోడు బ్రేక్ ఫాస్ట్, లంచ్, అది కూడా మంచి పోషకాహారాన్ని అందించాలని నిర్ణయించాం.విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి. క్రీడల్లో రాణించిన వారిని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. 2034 లో ఒలింపిక్స్ భారతదేశంలో నిర్వహించాలని ప్రధానమంత్రి ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఒలింపిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం... అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , ఎంపీలు డీకే అరుణ , వేం నరేందర్ రెడ్డి , రఘునందన్ రావు , చామల కిరణ్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.